వలయం

పాతికేళ్లు దాటినా నీలవేణి కింకా పెళ్ళి కాలేదు. ఆమె అనాకారి కూడా కాదు. మరీ సౌందర్యవతి కాదుగాని ఫరవాలేదనిపించే అందం ఆమెకి వుండనేవుంది వెనుకటికో సుప్రసిద్ధ రచయిత్రి నవల్లోనిహీరోయిన్లా "నేను మగాణ్ణి పెళ్ళి ఆడనుగాక ఆడను" అంటూ నీలవేణి ప్రతిజ్ఞ ఏమైనా తీసుకుందా అంటే అదేమీ కాదు. పద్దెనిమిదోయేడు ప్రవేశించినప్పట్నించీ అందరాడపిల్లలకిమల్లే ఆమెకీ పెళ్ళి చేసుకోవాలనే కోరిక వుంది. మరయితే నీలవేణి ఇంకా అవివాహితగానే వుండిపోడానికిగల కారణం ఏమిటంటే—మొగుణ్ణి కూడా డబ్బిచ్చి కొనుక్కునే గ్రహచారం దయ్యంలా పట్టి పీడించే ఈ దేశంలో ఒకానొక నడి తరగతి సంసారంలో నీలవేణి ఆడదై పుట్టడం మాత్రమే.

మామూలు గుమాస్తాగా ప్రారంభించి యు డి సి గా మాత్రమే తండ్రి రిటైరయ్యే నాటికి నీలవేణికి సరిగ్గా పద్దెనిమిదేళ్ళు. ఆర్థిక ఇబ్బందులవల్ల ఆదర్శాలే వంటబట్టాయో, ఆదర్శాల పుణ్యమా అని ఆర్థిక ఇబ్బందులే ఎదురయ్యాయో తెలీదుగాని లోకనాధంగారు విశ్రాంతి తీసుకునేనాటికి అతని ఆశయాలు రెండు మాత్రం నెరవేరాయి. తను గృహస్థాశ్రమం స్వీకరించినప్పటినుంచి చేస్తూ-తీరుస్తూ మళ్ళీ చేస్తూ సేకరించిన రుణ సముదాయాన్ని వడ్డీతో తీర్చి పారేయగలిగేడు వాళ్ళనీ వీళ్ళనీ బతిమాలి బి. ఏ. పాసయిన కొడుక్కి పట్నంలో ఓ గుమాస్తా వుద్యోగం వేయించగలిగేడు ఇకపోతే కూతురికీ కొడుక్కీ కట్నం లేకుండా పెళ్ళిళ్ళు చెయ్యటమన్నదే ఇప్పుడాయనకి మిగిలివున్న ఒకే ఆశయం, ఆదర్శమూను కాని ఈ ఆదర్శానికీ, తన చేతిలో చిల్లి గవ్వ లేకపోవటానికి చాలా సన్నిహిత సంబంధం వున్నదన్న సంగతి బహిరంగంగా ఒప్పుకోవటం మాత్రం లోకనాధంగారికి సుతరామూ ఇష్టంలేదు.

తనకి జన్మలో ఇహ పెళ్ళయ్యే రాత లేదనే నిర్ణయానికి చాలా రోజుల క్రితమే వచ్చేసింది నీలవేణి.

అన్న నిరంజనరావు నెల నెలా పంపించే డబ్బుతో మూడు పూటలూ తండ్రికి వండిపెడుతూ, కోరికల్ని చంపుకుని, ఒంటరిగా గడపటం దుర్భరంగా తోచింది నీలవేణికి. చదువు మానేస్తే పెళ్ళి చేసుకోవచ్చుననే ఆశతో స్కూల్ ఫైనల్ పూర్తి చెయ్యకుండానే చదువుకి స్వస్తి చెప్పేసింది కాని రెంటికీ చెడిన రేవడిలా తయారైంది బ్రతుకు

ఇంకా చదువుకుని తనూ ఓ వుద్యోగం చూసుకుని వుంటే ఈ బందిఖానాలాంటి జీవితం తప్పిపోయేది గదా అనుకుని, అలా చేయని తన మూర్ఖత్వానికి తన్ను తాను నిందించుకుంది.

ఈ కన్నెచెర విడిపించుకుని ఎవరితో

జి. మల్లీశ్వరి

నైనా లేచిపోదామనే ఆలోచన కూడా కలగకపోలేదు. నీలవేణికి కాని లేచి పోయిన ఆడపిల్లల జీవితాలన్నీ విషాదాం తాలుగానే చిత్రించే తెలుగు కథల్నీ చదివి చదివి ఆ ప్రయత్నం మానుకుంది. సరిగ్గా ఈ సమయంలోనే చీకటి నిండిన ఆమె జీవితంలోకి వెలుగురేఖలా ప్రవేశించాడు అతను.

మూడ్నెల్ల కిందట ఒకనాడు—

"హల్లో! కమలా! కంగ్రాచ్యులేషన్స్" అన్న మాటలు విని తిరిగిచూపింది. నీల వేణి. అప్పుడామె జిల్లా పరిషత్ గ్రంథా లయంలో ఏదో పుస్తకంకోసం వెదుకు తోంది

తిరిగిచూపిందే గాని తను తప్ప అప్పు డక్కడ మరో ఆడపురుగు ఎవరూ లేక పోయేసరికి "కమలా" అని సంబోధించ బడిన వ్యక్తికేసి పరిశీలనగా చూపింది. అతన్నిదివరకు ఎక్కడో చూసినట్టని పించింది ఆమెకి

చప్పున గుర్తుకి తెచ్చుకుంది, మొన్నీ మధ్య దీపావళి కథల పోటీల్లో ప్రథమ బహుమతి గెల్చుకున్న రచయిత ఫోటోకి, ఇతనికీ చాలా దగ్గరి పోలికలున్నాయని. తనకేసి అలా చూస్తూ నిలబడిన నీలవేణిని చూపి చిన్నగా నవ్వేడు అతను. కొద్దిగా తడబడ్డ నీలవేణి—

"క్షమించండి! మీరు ?" అని వాక్యం పూర్తి చెయ్యకముందే "నా పేరు కమలాకరం" అన్నాడతను.

"మీ పోటీ కథ చదివాను. చాలా బావుంది" అన్నది నీలవేణి కొంచెం సిగ్గుపడి తల వంచుకుని.

"థేంక్స్" అని, అంతలో మరెవరో అతడ్ని పలకరించేసరికి అక్కణ్ణించి కదిలాడు.

వివిధ పత్రికల్లో 'కమల' పేరుతో వచ్చే కథల్ని చాలా చదివింది నీలవేణి. పెళ్ళికాని ఆడపిల్లల జీవితాల్ని, సమస్య లను వివిధ కోణాల్లో, హృదయానికి హత్తుకుపోయేలా చిత్రించే ఆ కథలంటే ఆమెకి చాలా ఇష్టం వరకట్న దురాచా రాన్ని కథావస్తువుగా తీసుకుని అతనీ మధ్యే రాసిన ఓ కథ ఆమెకి మరీ బాగా నచ్చింది. ఆ కథలోని మృదులవేణికీ తనకీ చాలా పోలికలున్నాయి కథ చివర్న సూచించిన ఆ పరిష్కారం — ఎంతవరకు ఆచరణ యోగ్యమన్న సంగతి అటుంచి- జీవితంలో ఇలా జరిగితే ఎంత బావుణ్ణని పించింది నతనికి.

వారం రోజుల తరువాత లైబ్రరీ పుస్తకాన్ని తిరిగిచ్చేసి వస్తుంటే దారిలో అతడు కనిపించి పలకరించాడు.

"హల్లో! నీలవేణిగారూ! బావు న్నారా?"

ముందు ఆ సంబోధన విని విస్తు పోయింది నీలవేణి

"ఏంటలా చూస్తున్నారు? ఆ రోజు లైబ్రరీలో విజిటర్సు బుక్కులో మీ పేరు చూశాను. లైబ్రరీ నుంచేనా రావటం" అన్నాడు తన చేతిలోని పుస్తకాలను చూస్తూ.

అవునన్నట్లు తల పంకించింది

"కమల పేరుతో కథల్రాసేది ఎవరో పెళ్ళికాని అమ్మాయే నని అనుకునేదాన్ని. పత్రికలో మీ ఫోటో చూసేదాకా" అంది చిన్నగా నవ్వుతూ.

"ఏం చెయ్యను చెప్పండి. నా అసలు పేరుతో రాస్తే పత్రికల వాళ్లు వేసుకో లేదు మరి" అని నవ్వాడు.

ఆ తరువాత ఏం మాట్లాడాలో తోచ లేదు నీలవేణికి. వచ్చేపోయేవాళ్ళంతా తమ కేసే విడ్డూరంగా చూస్తూన్నట్టనిపించింది.

"త్వరగా వెళ్ళాలి. వస్తాను" అనేసి అక్కడ్నుంచి కదిలింది.

మరొకసారి పార్కు దగ్గర కలిసాడు అతను.

"ఈరోజుకూడా త్వరగా వెళ్ళిపోవాలా మీరు?" అన్నాడు నవ్వుతూ. లేదన్నట్టు తలూపింది.

"అయితే పదండి. కాసేపలా పార్కులో కూర్చుని వెడుదురుగాని" అని తన అంగీకారంకోసం ఎదురు చూడ కుండా పార్కులోకి దారితీశాడు కమలా కరం. ఒక్క క్షణం తటపటాయించి అతడ్ననుసరించింది.

పార్కులో ఓ మూలగా చెట్టుకింద పచ్చికలో కూర్చున్నారిద్దరూ.

కాసేపు అతని కథల్ని గురించి అవీ

ఇవీ మాట్లాడాక చటుక్కున అడిగింది నీలవేణి. "మీకు పెళ్ళయిందా?" అని.

కమలాకరం నవ్వి "'లేదు' అంటే మీరు నన్ను పెళ్ళాడేస్తారా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

పచ్చికమీద వేళ్ళతో రాస్తూ రెండు నిమిషాలపాటు మౌనంగా వుండిపోయింది నీలవేణి ఆ తరువాత అతని కళ్ళల్లోకి సూటిగా చూసి "కట్నం ప్రసక్తి లేకుండా నన్ను చేసుకోవటం మీ కిష్టమైతే అందుకు నే నీ క్షణమే సిద్ధంగా వున్నాను" అంది

మొదట ఆమె చొరవకి చకితుడైన కమలాకరం ఆ వెంటనే ఆ మాటల వెనక దాగిన విషాదాన్ని, బాధనీ లీలగా అర్థం చేసుకోగలిగాడు.

"నా కథలన్నీ చదివి నన్నర్థం చేసుకున్నదింతేనా నీలవేణీ?"

మొదటిసారిగా తనలా సంబోధించే సరికి ఆమె హృదయపు లోతుల్లో ఒకింత పులకరింత జనించి కొద్దిక్షణాలు ఆమెను మాట్లాడనీకుండా చేసింది.

"కథల్రాయటం వేరు, వాటిలో పలికించే ఆదర్శాలకు అనుగుణంగా జీవించాలనుకోవటం వేరు కాదా" అంది అతని కేసి చూస్తూ.

"కొందరి విషయంలో గావచ్చు కాని నేనింతవరకూ నమ్మిన ఆదర్శాల కనుగుణంగా జీవితాన్ని మలచుకోవాలనే అనుకుంటున్నాను "

"అయితే చెప్పండి. నన్ను పెళ్ళి చేసుకుంటారా?"

గడ్డి పరకను తుంచి మునుపంటితో కొరుకుతూ వుండిపోయాడు కమలాకరం.

"ఏమాలోచిస్తున్నారు? ఏవిటిలా బరితెగించి అడిగేస్తోంది అనా?"

"కాదు మనసులోని మాటను సూటిగా, ధైర్యంగా వ్యక్తంచేసే వాళ్ళంటే నాకెంతో ఇష్టం."

"మరయితే నే నడిగిందానికి సమాధానం చెప్పరేం?"

"మరీ తొందర పెట్టేస్తున్నావు నీలాగే నాకూ పెళ్ళి కావాల్సిన ఓ చెల్లెలుంది దానికి కాకుండా నేను చేసుకోవటం నా కిష్టంలేదు."

నీలవేణిలో అతని మాటలు పరిపరి విధాల ఆలోచనలను రేకెత్తించాయి కాని వాటిని వెంటనే అతని ఎదుట వ్యక్తం చేయటం భావ్యం కాదనుకుంది. వాళ్ళిద్దరి మధ్యా కొన్ని నిమిషాలు మౌనంగానే దొర్లిపోయాయి చీకటి పడింది. ఇద్దరూ పార్కులోంచి లేచారు

ఆ రాత్రి నీలవేణి చాలాసేపటిదాకా ఆలోచిస్తూనే వుంది. తనకు కమలాకరంతో వివాహం జరగాలంటే ముందుగా అతని చెల్లెలికి పెళ్ళి కావాలి తనలాగే ఆ అమ్మాయికీ కట్నం తీసుకోకుండా పెళ్లాడ్డానికి సిద్ధపడే వరుడు దొరికి వుండడు అంతే అయివుంటుంది యవ్వనం వుడిగిపోతున్నా కట్నా లివ్వలేక అవివాహితులుగానే మిగిలిపోతూన్న అబలలు ఎంత మంది లేరీ దేశంలో.

కమలాకరంలాగే తన అన్నయ్య కూడా ముప్ఫయి దాటినా ఇంకా పెళ్ళి చేసుకోలేదు.

కమలాకరం చెల్లెల్ని అన్నయ్య చేసుకుంటే?

ఈ ఆలోచన పార్కులో వున్నప్పుడే తనకు తట్టింది కాని ఎంచేతో వెంటనే కమలాకరంతో ఈ మాట అనలేకపోయింది ఈసారి కలుసుకున్నప్పుడు తప్పకుండా ఈ విషయం మాట్లాడాలి తమలో ఎవరికీ కట్నాలు తీసుకునే వుద్దేశం లేదు కమలాకరం చెల్లెల్ని అన్నయ్య చేసుకుంటే, తనకీ కమలాకరానికీ పెళ్ళవుతుంది రెండు పెళ్ళిళ్ళూ ఒకే ముహూర్తంలో,జరిగిపోగలవు అన్నయ్యక్కూడా వుత్తరం రాసి, ఇక్కడికి రప్పించి అన్ని విషయాలూ మాట్లాడాలి ఇలా ఆలోచిస్తూ అర్ధరాత్రి దాటింతర్వాత నిద్రలోకి జారుకుంది నీలవేణి.

తెల్లవారింది ఎప్పుడెప్పుడు సాయంకాల మౌతుందా, కమలాకరాన్ని కలుసుకుని అతనితో తన ఆలోచనలు పంచుకుందామా అని ఆమె మనసు వురకలు వేసింది. సాయంత్రం అయిదుగంట లవుతూండగా లైబ్రరీకి చేరుకుంది ఆరు గంటలు దాటినా అతని జాడలేదు. లైబ్రరీ మూసే వేళ కూడా అయిపోయింది. నిరాశతో ఇంటికి తిరిగివచ్చింది నీలవేణి. ఇలా వరుసగా మూడురోజులూ నిరాసే ఎదురైంది ఆమెకి నాలుగోనాడు ఇక వుండబట్టలేక లైబ్రేరియన్ని అడిగింది—కమలాకరాన్ని

"హల్లో కమలా" అని పలకరించేటంతట చనువున్న మిత్రుడు ఆ గ్రంథాలయంలో అతనొక్కడే గనక.

"అరె! మీకు తెలీదేవిఁటి! కమల వాళ్ళ వూరెళ్ళి నాలుగు రోజులైంది.

ఏదో అర్జంటు పనిమీద బయలుదేరుతున్నానని చెప్పి వెళ్ళాడు" అన్నాడు.

ఊరికి వెళ్ళిన కమలాకరం మళ్ళీ పది రోజులకిగాని తిరిగి రాలేదు అతన్ని కలుసుకోవాలనే తహతహతో రోజూ ఎదురుచూసింది నీలవేణి అందుక్కారణం అన్నయ్య దగ్గర్నుంచివచ్చిన ఆ వుత్తరం

నాన్నగార్కి నమస్కారించి—

క్షేమం అక్కడ మీరూ, చెల్లెలు నీలవేణీ కులాసాయేనని తలుస్తున్నాను. నేను కట్నం తీసుకుని వివాహం చేసుకోవటానికి నిశ్చయించాను. మీ ఆదర్శాన్ని పాటించలేక పోతున్నందుకు క్షంతవ్యుణ్ణి మనిషి మనుగడలోని అన్ని దశలూ డబ్బుతో, లాభాపేక్షతో ముడిపడివున్న ఈ వ్యవస్థలో మనమాశించే మార్పు మీరూ నేనూ మడి గట్టుక్కూర్చున్నంత మాత్రాన రాదు సమాజంలో మౌలికమైన పరిణామం రానిదే ఇలాంటి దురాచారాలను రూపుమాపటం సాధ్యంకాదు. నేను కట్నం పుచ్చుకోవటంవల్ల మరో ముఖ్యమైన ప్రయోజనంకూడా వుంది ఆ డబ్బుతో చెల్లెలిక్కూడా ఓ సంబంధం చూడొచ్చు ఇవన్నీ ఆలోచించిన మీదటే నేసీ నిర్ణయం తీసుకున్నాను. అమ్మాయి ఫోటోచూడ్డం, వాళ్ళ పెద్దవాళ్ళతో మాట్లాడటం కూడా అయిపోయింది. వీలైనంత తొందరలో ముహూర్తం పెట్టుకోవాలని వాళ్ళు తొందరపడుతున్నారు చెల్లెలిక్కూడా సంబంధం కోసం ప్రయత్నిస్తున్నాను. ఈసారి అక్కడి కొచ్చినప్పుడు అన్ని వివరాలూ మాట్లాడుకుందాము.

ఇట్లు,
— నిరంజనరావు

వుత్తరం చదువుకున్న నీలవేణి నీరుగారిపోయింది

లోకనాథం మాత్రం ఉలకలేదు పలకలేదు. తండ్రిగా తను వాళ్ళకి పెళ్ళిళ్ళు జరిపించే స్థితిలో లేడు ఆదర్శమో, వల్లకాదో వాళ్ళ జీవితాలకు దారివాళ్ళు వెదుక్కోవటం అతనికి సబబుగానే కనిపించింది

నీలవేణికి మాత్రం తను ఆలోచించి పెట్టుకున్న పథకం పాడైపోతూందేనన్న బాధ కలిగింది అన్నయ్య అలా తొందరపడి వాళ్ళకి మాటియ్యడం ఆమెకేమాత్రమూ నచ్చలేదు ఇప్పటికయినా మించిపోయిందేం లేదు ముహూర్తాలింకా పెట్టుకోలేదు కదా కమలాకరం ఈ రోజైనా వస్తే అతనితో మాట్లాడి వెంటనే అన్నయ్యకి వుత్తరం రాసెయ్యొచ్చు ఆ సంబంధం మానుకొమ్మని. ఇలా ఆలోచిస్తూన్న నీలవేణి 'పోస్ట్' అన్న కేకతో వులిక్కిపడింది ఈ రోజేమిటో ఇన్ని వుత్తరాలు అనుకుంటూ పోస్టుమేన్ చేతిలోంచి కార్డు అందుకుంది చాలాకాలం తరువాత మీనాక్షి రాసిన వుత్తరం అది. తనూ, మీనాక్షీ ఫోర్తుఫారందాకా కలిసి చదువుకున్నారు

"నిజం చెప్పవే నీలూ! నన్నెవరైనా పెళ్ళి చేసుకుంటారంటావా?" అంటూ వుండేది ఆ పిల్ల.

పాపం మీనాక్షి అందంగా వుండదు. కాకి నలుపు అటువంటి దానిక్కూడా ఇన్నాళ్ళకి ఓ సంబంధం కుదిరింది.

"చేరెడేసి కళ్ళూ, చంద్రబింబంవంటి ముఖమూ వున్న నీకే ఇంతవరకూ



మొగుడు దొరకలేదు. కాని నీలూ, నాది కాకి నలుపు ముఖమని తెలిసికూడా నన్ను చేసుకుంటానని ముందుకొచ్చాడే ఒక మగధీరుడు నా అనాకారితనానికి ఖరీదు కట్టి అతగాణ్ణి బేరమాడేశాడు మా అన్న శ్రీపతి" అంటూ మీనాక్షి రాసిన ఆ నాలుగు మాటల్లో ఎంత వేదన దాగివుంది!

ఆ రోజు లైబ్రరీకి వెళ్ళిన నీలవేణికి అంతకు ముందురోజే కమలాకరం వచ్చాడన్న వార్త తెలిసింది. "ఈ సాయంత్రం ఆరు గంటలకి పార్కులో మిమ్మల్ని కలుసుకుంటానని చెప్పాడండి కమల మీ రొస్తే చెప్పమన్నాడు" అన్నాడు లైబ్రేరియన్

సరిగ్గా ఆరు గంటలకి పార్కులోకి అడుగుపెట్టింది నీలవేణి మేమిద్దరూ తరచుగా కూర్చునే అదేచోట పచ్చికలో చేతులూని, కొంచెం వెనక్కి వాలి ఆకాశం కేసి చూస్తున్నాడు కమలాకరం నీలవేణి నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి అతని పక్కగా కూలబడింది అలా కూర్చుంటున్నప్పుడు ఆమె పమిట జారి అతని చేతి వేళ్ళను మృదువుగా తాకింది. గిలిగింతలు పెట్టినట్టున్న ఆ స్పర్శకు వులిక్కిపడ్డ కమలాకరం

"హలో నీలవేణీ!" అంటూ సర్దుకుని కూర్చున్నాడు

"అంత అర్థాంతరంగా వెళ్ళిపోయారు. ఏమిటి విశేషం?" అంది నీలవేణి చీర కుచ్చెళ్ళని పాదాలమీదికి లాక్కుంటూ

పేలవంగా నవ్వేడు కమలాకరం.

"పోన్లెండి. అంత చెప్పకూడని విషయమైతే" కొంచెం నిష్ఠూరంతో అంది అతన్నుంచి సమాధానం రాకపోయేసరికి.

మహోయానం

దినం ముఖాన
కాలం కప్పిన
నల్ల రెక్క-రేయి
నక్షత్రాలు పళ్ళ చక్రాలలో
నొక్కులు పడుతోంది !
గాలి గుర్రానికి
కాళ్ళు కట్టేసి
మీసం దువ్వుకుంటున్న
నిశ్శబ్దాన్ని చూసి
ఊపిరాడని చెట్టుకు
ఉక్కపోస్తోంది !
నేలమీదకు వంగిన
ఆకాశ రేఖావృత్త గర్భంలోని
కాంతి శిశు గుండ్రాన్ని
ఈ చేత్తో పైకెత్తి
దిక్కుల సంధిలో
దిక్కూ మొక్కూ లేకుండా
పడి వున్న
చైతన్యం ముక్కల్ని
ఏరుకొద్దామని
తూర్పు వైపు
బయలుదేరాను.

—"సాంధ్యశ్రీ"

"కాదు నీలవేణీ ముఖ్యంగా నీతో చెప్పాల్సిన విషయమే. అందుకే నిన్నిక్కడికి రమ్మందికూడా నా చెల్లెలు చావబోయి బతికింది!" అతని కంఠం గద్గదికమైంది ఆ మాటలంటున్నప్పుడు.

నివ్వెరపోయింది నీలవేణి.

"నీలాగే పాతికేళ్ళు దాటినా కన్నెపిల్లగానే మిగిలిపోయిన దురదృష్టవంతురాలు మా విమల. వివాహంమీద అన్ని ఆశలూ వదులుకున్నదాన్ని కట్నంలేకుండా చేసుకుంటానని ఆశలు కల్పించి ముందుకొచ్చాడు ఓ దౌర్భాగ్యుడు తీరా ముహూర్తాలు పెట్టుకునే సమయం దగ్గరకొచ్చేసరికి తలిదండ్రుల నిర్బంధానికి జడిసి కనీసం అయిదు వేలైనా కట్నం లేనిదే పెళ్ళికి ఒప్పుకోనని ప్లేటు ఫిరాయించాడు. పిరికిపంద ఈ వార్తతెలిసి అది నూతిలో దూకి ప్రాణాలు తీసుకోబోయింది సమయానికి ఎవరో చూసి రక్షించబట్టి సరిపోయిందిగాని " అతని కంఠం దుఃఖంతో పూడుకుపోయింది.

కాసేపు మౌనంగా వుండి అన్నది నీలవేణి

"మీరేం దిగులుపడకండి. మా అన్నయ్య మీ చెల్లెల్ని చేసుకునేటట్టు నేను ఒప్పిస్తాను అప్పుడు మనపెళ్ళి మీ చెల్లెలు విమల పెళ్ళి ఒకేసారి జరిపెయ్యొచ్చు ఏమంటారు?" అని ఆశగా అతనివంక చూసింది

అంత విషాదంలోనూ ఫక్కుమని నవ్వేడు కమలాకరం.

"మనిషికి కొన్ని మంచి ఆలోచన్లు చాలా ఆలశ్యంగా వస్తుంటాయి నీలవేణి. జరగాల్సిన అనర్థాలన్నీ జరిగిపోయాక"

అతని మాటలు అర్థం కాలేదు ఆమెకి.

"మా విమలకి అయిదువేల కట్నంతో వేరే సంబంధం ఖాయమైంది ఇది



సాధించడానికి ఆత్మను చంపుకున్నాను. నేను నమ్మిన ఆదర్శాలను అమ్ముకోవాల్సి వచ్చింది ఎవరో ముక్కూ ముఖం తెలియని అమ్మాయికి అమ్ముడు పోవటానికి అడ్వాన్సుగా అయిదువేలుకూడా తీసేసుకున్నాను "

ఆ మాటలు విన్న నీలవేణి హతాశురాలైంది తన ముందున్న పచ్చగడ్డి భగ్గున మండి తను కట్టుకున్న ఆశాసౌధాలన్నీ ఆ మంటల్లో కాలి కూలిపోతున్నట్లనిపించింది

చీకటిపడింది. పార్కులో దీపాలు వెలిగాయి నిర్వేదంతో పచ్చగడ్డిమీంచి లేచింది నీలవేణి

కొన్నాళ్ళు గడిచేయి

తిరుపతి కొండమీద కళ్యాణ శోభతో మంటపం కళకళలాడుతోంది నిమిషాల మీద పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి. పసుపు బట్టల కమ్మటి వాసనలు, పట్టుచీరల గరగరలు, పురోహితుల అరుపులు—ఈ సందడిలోంచి "హాయ్ నీలూ!" అన్న పిలుపు విని వెనక్కి తిరిగింది నీలవేణి. తన కెదురుగా నవ్వుతూ నిలబడివున్న మీనాక్షిని గుర్తుపట్టడానికి కొంతసేపు పట్టింది.

"ఏమిటే ఇక్కడ ప్రత్యక్షమయ్యావ్? ఏమిటీ వేషం? మాస్తుంటే నువ్వుకూడా నాలాగే కాబోయే శ్రీవారికోసం వెతుక్కుంటున్నట్టుందే!" స్నేహితురాలి భుజాలమీద చేతులువేసి అడిగింది మీనాక్షి.

"అబ్బ! ముందు ఈ సంతలోంచి బయటపడాలి. అక్కడెక్కడయినా తీరిగ్గా కూర్చుని మాటాడుకుందాం పద" అంటూ మీనాక్షితోకూడా మంటపం బయటికి నడిచింది నీలవేణి.

ఇద్దరూ దూరంగా వెళ్ళి మెట్లమీద

కూర్చున్నారు.

"అయితే ఇదన్నమాట. సంగతి" అంది మీనాక్షి నీలవేణి చెప్పిందంతా విన్నాక

"ఇప్పటికైనా మించిపోయిందేంలేదు. పద నేను చక్కబరుస్తాను అన్నీ" అని పైకి లేచింది

"అరె! మీ రిక్కడున్నారా! మీకోసమని అర్ధగంట నుంచీ గాలిస్తున్నాం మేము" అంటూ అక్కడికొచ్చారు నిరంజనరావు, శ్రీపతి ఆ నలుగురూ అక్కడ్నించి బయలుదేర బోతుండగా వాళ్ళని కలుసుకున్నారు కమలాకరం అతని చెల్లెలు విమల. మీనాక్షి నీలవేణి చెవిలో ఏదో చెప్పింది కమలాకరాన్ని చూపిస్తూ సిగ్గుతో నిండిన చిరునవ్వుతో తల దించుకుంది నీలవేణి.

చూపులు పక్కకి తిప్పుకున్నాడు కమలాకరం

"ముహూర్తాని కింక అర్ధగంటేవుంది. త్వరగా తెమలండి మరి" అని తొందర చేశాడు నిరంజనరావు

"ఒక్కనిమిషం ఆగండి అన్నయ్యా! ఓసారిలారా" శ్రీపతిని అవతలకు పిల్చింది మీనాక్షి. తక్కిన నలుగుర్నీ చూపిస్తూ అతనితో కాస్సేపు మాట్లాడింది ఓ పావు గంట తరువాత వచ్చి మళ్ళీ కలుసుకుంది

"చూడండి! ఇప్పుడు నేనో చిత్రమైన సంగతి చెప్పబోతున్నాను అది విన్న తరువాత మనం తీసుకోబోయే నిర్ణయం మీదే మన పెళ్ళిళ్ళు ఆధారపడతాయి.

నా పెళ్ళి జరిపించాలని అప్పుచేసి అయిదువేలు కట్నంగా ఇచ్చుకున్నాడు కమలాకరానికి మా అన్నయ్య శ్రీపతి ఆ డబ్బునే కమలాకరం నిరంజనరావుకి సమర్పించుకున్నాడు తన చెల్లెలు విమల పెళ్ళికి కట్నంగా.

ఆ అయిదువేలే ఇప్పుడు నిరంజనరావు మా అన్నయ్య కివ్వబోతున్నాడు నీలవేణికి కట్నంగా. నా పెళ్ళికోసంగాను మా అన్నయ్య ఇచ్చుచున్న కట్నం చేతులు మారి మళ్ళీ అతని దగ్గరకే చేరుతోంది. ఈ చేతులు మారటంలో ఎవ్వరికీ రవ్వంత ప్రయోజనం లేకపోగా ఒక ప్రేమికుల జంట అన్యాయంగా విడిపోతూంది అంచేత మనమిప్పుడు చేయాల్సింది ఆ జంటను కలపడం. అది మన బాధ్యత" చెప్పడం ఆపి అందరి ముఖాల్లోకి చూసింది మీనాక్షి

ఓ అయిదు నిమిషాలపాటు అక్కడ ఆ ఆరుగురి మధ్య చీమ చిటుక్కుమనేటంత నిశ్శబ్దం ఆవరించింది

"మీనాక్షీ! మరి నీ సంగతో"— నీలవేణి.

"చూడండి మీనాక్షిని నేను చేసుకుంటాను, విమలని శ్రీపతిగారు అంగీకరించే పక్షంలో" అన్న నిరంజనరావుకేసి నమ్మలేనట్టుగా చూశారు అందరూ

తన అంగీకారాన్ని చిరునవ్వుతో వ్యక్తంచేశాడు శ్రీపతి.

"నిరంజనంగారూ? నేను కాకి నలుపం డోయ్" అన్నది మీనాక్షి నవ్వుతూ

"చూసే కళ్ళల్లో సౌందర్య తృష్ణ వుండాలేగాని—నల్లగా వున్నా మీరే నా కళ్ళకి అందంగా కనిపిస్తున్నారు "

నిరంజనరావు మాటలకి అంతా ఆనందంగా నవ్వుకుని వడివడిగా కళ్యాణ మంటపంకేసి నడిచారు.

★